# వస్తువు

పత్రిక మాస పత్రిక -ఫిబ్రవరి, 07



# వస్తువు

"ఏయ్ పల్లవీ... ఇదుగో నబ్బా నీ పాస్‌బుక్. ఎప్పుడు కావాలంటే అప్పుడు డ్రా చేసుకో –" సహోద్యోగి శకుంతల పాస్‌బుక్‌ను పల్లవి డెస్క్ మీద పెడుతూ అంది.

పల్లవి పెదవి విప్పకుండానే మురిపెంగా దానిని చేతిలోకి తీసుకొంది. ఎర్రటి రంగులో ముచ్చటగా ఉందది. సరిగ్గా పల్లవి అరచేతిలో ఇమిడిపోయింది. ఏమీ ఎరుగనట్లుగా. అమాయకంగా.

పల్లవి ముఖాన చిరునవ్వు కదలాడింది. కళ్ళల్లో మెరుపు.

'అంతా అనుకున్నట్లుగానే జరుగుతుంది. నాలుగేళ్ళుగా డబ్బు కూడబెడుతూ వచ్చింది. ఓ ప్రముఖ చిట్ కంపెనీలో. అన్ని ఇన్‌స్టాల్‌మెంట్స్ పూర్తయ్యి – వాళ్ళ చెక్ ఇప్పుడే బ్యాంక్ క్లియరెన్స్‌కు వచ్చింది. హమ్మయ్య, అర్జున్‌కి సమయానికి అందివస్తుంది.' సంతోషం ఆమె ముఖాన తాండవించింది.

"హు... ఏంటి పల్లవీ – అప్పుడే అనూప్‌కి ఏం బహుమతి పట్టుకెళ్ళాలో ఆలోచించేశావా? సర్‌ప్రైజ్ గిఫ్ట్! నన్ను అడుగు. చెప్తా. కొత్త సిటీమాల్ కి వెళ్ళామనుకో –"

శకుంతల –ప్రశ్నలు సమాధానాలు తనే చెప్పేసింది ఏకబిగిన.

"శకుంతలా – నీ కెప్పుడూ కొనే గొడవే! చెక్ ఇంకా క్లియరెన్స్ కాలేదు. రెండు మూడు రోజులు పడుతుంది –"

"షాపింగ్ చేయడమంటే నాకు సరదా. నీకు తెలియంది ఏముంది? షాపులన్నీ తిరిగేసి కానీ ఇంటికి చేరను! ఇప్పుడు కాలం మారిపోయింది డియర్, లోకమంతా ఓ పెద్ద సంత. అమ్మేవాళ్ళు కొనేవాళ్ళు – రెండే రకాల మనుషులు –" శకుంతల వేదాంతిలా బోధన మొదలెట్టింది.

"చెవిలో జోరీగలా ఎన్ని మార్లు చెప్తావే బాబూ – ఆ మాటలని? నన్ను వదిలేయ్! ఏదన్నా కొనదలుచుకుంటే నిన్ను తీసుకొనే వెళతా – సరేనా? కానీ, ఇది ఎంతో ముఖ్యమైన పని కోసం పొదుపు చేసినడబ్బు" పల్లవి చిరునవ్వుతో అంది. మరుక్షణం ఆ రహస్యం కూడా చెప్పేసింది. "అర్జున్ చదువు కోసం". పాస్‌బుక్ ను తన డెస్క్‌లోకి నెట్టేసింది.

పల్లవి ముందు చూపుకు శకుంతలతో సహా స్నేహితులంతా అభినందించారు. ఆనందంగా ఇల్లు చేరింది పల్లవి. బోలెడంత హుషారుతో.

అర్జున్ బడి నుంచి ఆటల్లో పడ్డాడేమోనని – వెళుతూ అపార్ట్‌మెంట్ ఆవరణలో వెతికి చూసింది. అర్జున్ ఎక్కడా కనబడలేదు.

'ఇంట్లో ఉన్నాడేమో – ట్యూషన్ కి వెళ్ళిపోయాడో ' పల్లవి ఆలోచిస్తూ కైనెటిక్‌ను పార్క్ చేసి ఇంట్లోకి నడిచింది.

అయిదో అంతస్తులో ఆరో ఇల్లు.

కరెంట్ లేదు. అక్షరాల చచ్చీ చెడి అన్ని అంతస్తులు నడుస్తూ రావాల్సివచ్చింది.

పైకి చేరగానే కరెంట్ వచ్చేసింది.

'ఇది ఒకందుకు నయం' ఫ్యాన్ ఆన్ చేసుకుంటూ అలుపు తీర్చుకొంటోంది పల్లవి.

'రేపటి నుంచీ ట్రెడ్ మిల్ చేయాలి' పల్లవి చటుక్కున నిర్ణయం తీసేసుకొంది. 'ఈ మాత్రానికే అలుపు రావడం ఏమిటి?'

టీ చేసుకుంటూ తన ఇంటిని కళ్ళారా చూసుకొంది పల్లవి. తీర్చి దిద్దిన ఇల్లు. తీరైన సంసారం. అనూప్ అదే మాటతో ఏకభవిస్తాడు. 'బాదరబందీలు ఏవీ లేవు. ఒకప్పటిలా బతకడం ఎలాగ అన్న ప్రశ్న గానీ – ఈ బతుకీడ్చడం ఎలాగ అన్న నిరాశ నిస్పృహలు కానీ లేవు. ఇప్పుడు బతకడం ఎలాగో తెలిసి బతుకుతున్నాం! జీవించడం అంటే – జీవితం అంటే ఇదీ!'

'తను బ్యాంక్‌లో అయిదంకెల జీతం సంపాదించుతోంటే – అనూప్ ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీలో తనకు రెండింతలు సంపాదిస్తున్నాడు. ఇద్దరి జీతభత్యాలు. జీవితం హాయిగా గడిచిపోతోంది. ఒక్కడే ఒక్క బిడ్డ – అర్జున్. ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వాడిని కోరుకున్న చదువు చదివియ్యాలి. అందరిలాగా వెతుక్కునే పని లేకుండా – అన్నీ ముందే అమర్చి ఉంచుతున్నాం. హాయిగా!'

గలగల మంటూ వచ్చిన తండ్రీ కొడుకులు పల్లవిని లోకంలో పడేసారు.

కాసేపటిలోనే, అర్జున్ చదువుసంధ్యలలోకి, అనూప్ ఇంటికి తెచ్చుకున్న ఆఫీస్ పనిలోకి, పల్లవి ఇంటి పనిలోకి మళ్ళారు.

అయితే, ఆ మరునాడు అర్జున్‌ను బడిలో వదలడానికి వెళ్ళేటప్పటికి కానీ, పల్లవికి ఓ విషయం తెలియలేదు.

అది చాలా చిన్నదే కావచ్చు. కానీ, ఒక పెద్ద ప్రకంపనం ప్రారంభం అయ్యింది. నిశ్చలంగా ఉన్న నీటిలో వేసిన రాయిలా – ఆ ఒక్క చిన్న విషయం వాళ్ళ కుటుంబాన్ని కుదిపేసింది. నిలువునా.

ఆ ఉదయం కైనెటిక్ వీధి మలుపు తిరగగానే – అర్జున్ బోలెడంత హుషారుగా అరిచాడు.

"అమ్మా – అటు చూడు – ఎంత పెద్ద టివి నో –"

"ముందు తిన్నగా కూర్చోరా – పడిపోతావ్ " హెల్మెట్ వలన తలతిప్పలేక అలాగే అరిచింది.

"అబ్బ – సరిగ్గా చూడమ్మా – దాన్నే మనం తీసుకొనేది –"

"ఆహా..!" తేలిగ్గా అంది పల్లవి.

"సరిగ్గా నువ్వు ఇలాగే అంటావని నాన్న ముందే చెప్పాడు –"

"ఊ...!?! " పల్లవి ఆశ్చర్యం అయోమయం కలగలిసి అంది.

"అవునమ్మా – నాన్న ఎప్పుడో చెప్పేశాడు. సరిగ్గా ఈ నెల పదోతేదీన ఆ పెద్ద టివి మన ఇంట్లో ఉంటుందనీ – నీతో చెప్పద్దని – " గొప్ప రహస్యం విప్పి చెప్తున్నట్లు అన్నాడు అర్జున్.

"ఎందుకని ?"

"ఏమో తెలియదు. మొదటిసారి టివిలో మేమిద్దరం ఈ అడ్వర్‌టైజ్‌మెంట్ చూశాం – ఆ రోజే చెప్పాడు నాన్న. మొన్న మేమిద్దరం షాప్‌కి కూడా వెళ్ళి చూసాం –"

"అదేంటి?"

"నువ్వు ఖచ్చితంగా వద్దంటావని అన్నాడు నాన్న. వాళ్ళతో అన్నీ మాట్లాడేసాడు. ఆ షాప్‌లో ఒక్కటే ఉందట. అది కాస్తా అమ్మేస్తారేమోనని నాన్నకి భయంట –"

"అయినా అర్జున్, మనకు ఎందుకురా కొత్త టివి? ఇప్పుడున్న టివి కొని ఏడాది కాలేదు. అదే బెస్ట్ మోడల్ అప్పటికి. లక్షకు పైనే అయ్యింది. చక్కగా ఉంది. ఇంతలో మరోటి ఎందుకని? అయినా, ఉన్నదాన్ని ఏం చేసుకొంటాం? సర్లే, ఇవన్నీ నీకు ఎందుకు గానీ –నాన్నా నేనూ మాట్లాడుకుంటాంలే –" స్కూల్ రావడంతో పల్లవి సంభాషణను అర్ధాంతరంగా ఆపేసింది.

"నాన్న నీతో అన్నీ నన్నే మాట్లాడమన్నాడు. ఇవ్వాళే మాట్లాడమన్నాడు. ఏమేం మాట్లాడాలో తనే చెప్పాడు. నాన్నకు – నువ్వంటే భయంట!"

"ఏంటి?"

"ఊ... భయం!" కళ్ళు పెద్దవి చేసి అర్జున్ అన్నమాట పల్లవిని ఒక్కసారిగా అప్రమత్తం చేసింది. ఆ క్షణం అర్జున్ ముఖంలో కదలాడిన అవ్యక్త భావం ఆమెను అయోమయంలో పడేసింది.

"అర్జున్ ఏంటి నాన్నా...ఇలా..."

"బై..సీయూ" అర్జున్ మరో మాటకు వీలులేకుండా బడిలోకి పరిగెత్తాడు.

పల్లవి బడి నుంచి తిరిగి వస్తూ ఆ హోర్డింగ్ వైపు చూసింది.

చాలా పెద్ద టివి. తమ ఇల్లు ఒక మామూలు అపార్ట్‌మెంట్. ఖచ్చితంగా అంత పెద్ద టివికి ఏ మాత్రం స్థలం లేదు. బహుశా అయిదడుగుల వెడల్పు ఉంటుందేమో అటు ఇటూగా. అంతకు దగ్గ పొడవు. చాలా పెద్దది. ఆపై స్పీకర్లు వగైరా వగైరా.

పల్లవి ఇంటి ముఖం పట్టింది. అనూప్ ఇంట్లోనే ఉన్నాడు.

అనూప్‌ను ఆ సమయంలో అక్కడ చూడగానే పల్లవి ముఖాన ఓ ప్రశ్నార్థకం దోబూచులాడింది. మామూలుగా ఈ పాటికి ఆఫీసు తోవ పట్టేవాడు.

ఇప్పుడు బయలుదేరితే కానీ, ఆయన ఆఫీసుకు సమయానికి చేరలేడు. రోజూ ఓ ఊరెళ్ళి వచ్చినంత. దానికి తోడు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన ట్రాఫిక్.

పల్లవి లోపలికి వెళ్ళి ఆఫీసుకు తయారవసాగింది. ట్రౌజర్ ఇస్త్రీ చేసుకొంది. కుర్తీకి మ్యాచింగ్ గాజులు పేర్చుకుంది. ఇల్లంతా అటు ఇటు తిరుగుతోంది. నిజానికి, ఇదంతా అనూప్‌ను ఆకర్షించడానికే. ఇద్దరి నడుమ ఒక సంభాషణ ప్రారంభం కావడానికే. ఎన్నడూ లేని ఒక వింత నిశ్శబ్దం ఇద్దరి మధ్యన.

ఒక్కోసారి ఒక్క పదం చాలు మనిషిని అల్లకల్లోలం చేయడానికి.

అర్జున్ వాడిన ఆ ఒక్క పదం – "భయం"

'అమ్మా – నాన్నకు నువ్వంటే భయం!"

'ఇది వేళాకోళమా వెటకారమా? పోనీ, మాటవరసకో సరదాగానో అన్నాడనుకోనా అంటే – ఇదంతా ఏమిటి? ఈ మౌనం. మూతి ముడిచి బిర్ర బిగిసి కూర్చోవడం. హెడ్మాస్టర్ ముందు నిలబెట్టబడిన తప్పు చేసిన పిల్లాడిలా – ఆ బెరుకు ..ఛ!' పల్లవి అసహనంగా పెదవి విరిచింది,' చిన్న పిన్నీసు నుంచి ఈ ఇల్లు కొనేవరకూ ఇద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకొన్నారు. ఆ క్రమంలో ఎంత సరదాగా ఎంత సంతోషంగా గడిపేవారో. పకపక లాడుతూ. అంతెందుకు – అసలు సిసలు ఆధునాతన దంపతులం మేం – అంటూ సగర్వంగా చెప్పుకొనేవాళ్ళం కాదూ?

అనూప్ ఇష్టాలను తనూ, తన అభిరుచులను అనూప్ – అపురూపంగా అమర్చుకోవడం తమ ఇద్దరికీ ఎంత ఇష్టమో – నిజానికి అది అలవాటైపోయింది. అలాంటిది ఇప్పుడు ఏమిటిలా? ఇదంతా చాలా కొత్తగా ఉంది. ఊపిరాడనట్లుగా ఉంది.'

పల్లవి ఇబ్బందిని దిగమింగుతూ ముఖాన చిరునవ్వు అతికించుకుంది. ఎంత ప్రయత్నించినా నొసటి మీది సన్నటి ముడి మాత్రం వీడలేదు.

"ఓకే అనూప్... నేను బయలుదేరుతున్నా. . సీ యూ –" ప్రతిరోజూ చెప్పినంత సహజంగా చెప్పడానికే ప్రయత్నం చేసింది. పదాల నడుమ తడి లేకపోవడం ఇద్దరికీ తెలుస్తూనే ఉంది. ఇప్పుడు బయలదేరితేగానీ, పల్లవి సమయానికి బ్యాంక్‌కి చేరలేదు.

అనూప్ బదులివ్వకుండా గంభీరంగా తలాడించాడు. ముద్దుగారే అతని ముఖం చెక్కముక్కలా బిగుసుకుపోయి ఉంది.

ఒక సహజమైన ఆందోళన పల్లవిలో అనుమానమై పొడచూపింది. అనూప్ ముఖం జ్వరపడ్డట్లుగా తోచింది పల్లవికి.

"అనూప్... ఏంటలా ఉన్నావ్? వంట్లో బాలేదా?" ఆదుర్దాగా అతని నుదుటి మీద చేయి వేయబోయింది. అమె వేసినంత వేగంగా విసిరి కొట్టాడు అనూప్.

పల్లవి చిన్నబోయి వెనక్కి జరిగింది. విస్తుపోయి అతని వంకే చూస్తూ నిలబడింది.

"నేను బాగానే ఉన్నా! అలా ముట్టుకొంటే నాకు చిరాకు!" శ్లేషతో నిండిన పదాలు దూసుకువచ్చాయి పల్లవి వైపు.

'ఒక కొత్త మనిషి. కొత్త చిక్కు' పల్లవి ఇబ్బందిగా కదిలింది. 'కొత్త ప్రవర్తన' పల్లవి ఒక్కసారి తేరుకొని, కైనెటిక్ తాళాలు తీసుకొని ముందుకు నడిచింది.

"ఎనీ వే...... టేక్ కేర్..."భుజం మీద నుంచి వెనక్కి చూస్తూ బయటకు వెళ్ళింది.

ఆమె కళ్ళల్లో మనసులో అనూప్ రూపం ముద్రించుకు పోయింది. ఎర్రబడిన ముఖం. బిగుసుకుపోయిన శరీరం. కరుకు మాటలు, చికిలించిన కళ్ళు... హు!

పల్లవి తొందరగా తేరుకోలేక పోయింది. అన్యమనస్కంగా రోడ్డు మీద పడింది. ఈ హడావిడిలో ఎవరినైనా గుద్దేయడమో - ఎవరికి చేతనైనా కొట్టించుకోవడమో తప్పేట్లు లేదు. పల్లవి బలవంతంగా రోడ్డు మీద దృష్టి పెట్టింది. ఆలోచనలని కట్టిపెట్టాలని ప్రయత్నిస్తూనే.

సరిగ్గా, ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర - రెడ్ సిగ్నల్ ! హాల్ట్!

పల్లవి చుట్టూ చూసింది. కాళ్ళను నేలకు ఆనించి.

ఆ సెంటర్‌లో కూడా అదే హోర్డింగ్. చాలా పెద్దది. ఓ అందమైన యువ జంట వయ్యారంగా మనోహరంగా పెనవేసుకొంటూ -

టివి చూస్తున్నారు.

పల్లవికి అప్రయత్నంగా నవ్వొచ్చింది. ఫక్కున నవ్వేసి తలవాల్చేసింది.

'అంతటి తన్మయత్వం కలిగిన క్షణంలో చుట్టూ ఉన్న ప్రపంచమే మాయమై పోతుందే - ఇక టివి కూడా కంటబడుతుందా?'

తల విదిల్చి - తలపై హెల్మెట్ సరిచేసుకొంది. షోరూం అడ్రస్ వైపు ఆమె కళ్ళు కదిలాడాయి. నిశ్శబ్దంగా బ్యాంక్ వైపు బయలుదేరింది.

ఆమెతో పాటే వెన్నంటి ఆమె ఆలోచనలు సాగాయి.

'మార్పు వచ్చింది అనూప్‌లో. తనలో. ఎందుకో ఏమిటో స్పష్టంగా అర్థం కావట్లేదు గానీ, మార్పు వచ్చింది. చాలా బలమైన మార్పు -'

ఇంతలో శకుంతల వచ్చి చెప్పింది, "ఏంటి పల్లవీ - ఎన్నడూ లేనిది ఇవ్వాళే ఆలస్యంగా వచ్చావ్? ఆర్ యూ ఓకే...?"

"ఇప్పటి వరకూ" - పెదవులు బిగబెట్టి మామూలుగా అయ్యే ప్రయత్నంలో నవ్వింది పల్లవి.

"ఇదుగో మేనేజర్ నీకు ఇది ఇవ్వమన్నారు. సాయంత్రం తాజ్‌లో డైరెక్టర్ల మీటింగ్ ఉందిట. నువ్వు అర్బన్ లెండింగ్ పాలసీ మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయాలట!"

"అలాగే -"

"బహుశా కొత్త స్టడీ లోన్స్ ప్లాన్ చేయబోతున్నారనుకొంటా -" శకుంతల పల్లవికి కాగితాలు అందిస్తూ అంది.

"థాంక్ యూ" పల్లవి నిర్లిప్తంగా ఆ కాగితాన్ని అందుకొంది.

తన డెస్క్ ముందున్న కార్డ్‌బోర్డు కి పిన్ చేసింది. నీలంరంగు వెల్వెట్ నేపథ్యంలో పసుపు పచ్చని కాగితం. ఎర్రని అక్షరాలు. అర్జంట్ - అంటూ.

'ఈ పూట కస్టమర్ సర్వీస్ లేకపోవడం ఒకందుకు మంచిదే అయ్యింది' పల్లవి నిట్టూర్చింది. కావలసిన ఫైళ్ళు తీసుకోవడానికి రికార్డు రూంలోకి నడచింది. ఆమె అడుగులో అడుగువేస్తూ ఆమె ఆలోచనలూ నడిచాయి.

'నిజమే. ఈ మధ్య అనూప్ ధోరణిలో చాలా మార్పు వచ్చింది. ఒక సెల్‌ఫోన్, ఒక టెలివిజన్, ల్యాప్‌ట్యాప్, డిజిక్యామ్ - కాకపోతే ఓ విదేశీయానం - ఇవన్నీ తమ ఇద్దరి మధ్య వచ్చి తిష్ట వేస్తున్నాయి. పత్రికా ప్రకటనల రూపంలో అవి తిన్నగా తమ పడకగదిలోనే వచ్చి కూర్చున్నాయి. తమ ఇద్దరినీ చెరోపక్కకు నెట్టేస్తూ.

అర్ధరాత్రి అపరాత్రి దాకా వాటన్నిటి వివరాలు చదవడం -టివిలో ఇంటర్నెట్‌లో మరిన్ని వివరాలు తెలుసుకోవడం - సహజమై పోయింది.

భోజనం చేస్తున్నా - కాస్త కులాసాగా అలా కబుర్లు మొదలెట్టినా - కలిసి ప్రయాణం చేస్తున్నా - ఏదో ఒక వస్తువు గురించే మాట్లాడడం - మామూలయి పోయింది.

అందులోనూ, అనూప్‌కి ఈ మధ్య బ్రాండ్ వస్తువులపై మోజు ఎక్కువై పోయింది.

వేలకు వేలు పోసి కొన్న సెల్‌ఫోన్ ఆర్నెల్లు తిరగకుండానే పాత మోడల్ అవుతుంది. మరో పదిహేనో పాతికో పోసి సరికొత్త మోడల్ స్వంతం చేసుకుంటాడు. పాతది అమ్మితే సగానికన్నా తక్కువ ధర పలుకుతుంది. ఎందుకులే అంటూ తన చేతిలో పెట్టేస్తాడు. మళ్ళీ మొదలు.

అలాగే, టివిలు, విసిడిలు, ఐపాడ్‌లు - ఎట్సెట్రా ఎట్సెట్రాలు. ఇవ్వన్నీ ఎప్పటికప్పుడు మార్కెట్‌లో లేటెస్ట్ హాటెస్ట్ మోడళ్ళు. కొనబోతే కొరకొరలాడే ధరవరలు. అమ్మబోతే అడిగే నాథుడే ఉండడు. ఇదీ వరస!

కొత్త కారు తీయని ఆ వస్తువు ఇంట్లోనే పడివుంటుంది. ఎవరికైనా బహుమతిగా ఇవ్వడానికైనా వాడిన వస్తువు ను వేరొకరికి ఎలా ఇస్తాం?' పల్లవి నిట్టూర్చింది-

'ఏ వస్తువునైనా ఓ ధర పెట్టి కొంటాం. మనం ఏ మేరకు ఆ వస్తువును వినియోగించుకోగాలిగామన్న దానిని బట్టే కదా - గిట్టుబాటో కాదో తెలిసేది.

కొన్ని కొన్ని సందర్భాలు ఉంటాయి. ఎర్ర ఏగానీ పెట్టి కొంటే - మాగాణిధరలు తిరిగి తెస్తాయి. ఈ ఎలక్ట్రానిక్స్ విషయంలో అది తిరగరాయాలి. మాగాణి అమ్మి కొంటే ఎర్ర ఏగానీ చేతిలో మిగులుతుంది!

ఆకర్షణ. అందమైన వలలా విసిరే బ్రహ్మాండమైన ప్రకటనల ఆయస్కాంతశక్తి! వెంటనే కొనాలనిపించడం ఒక ఎత్తు. కొనకపోతే

మనం తెలివితక్కువ వాళ్ళమేమో - నలుగురిలో వెనుక బడిపోతామేమో - ఇట్లాంటి అనేక అనవసర ఆలోచనలు పుట్టించే ఆకర్షణ. ఒక బలమైన సుడిగుండంలా-!

ఈ మార్కెట్టు మాయాజాలం - ఆక్టోపస్‌లా అన్ని చేతులతో చుట్టేసి తమ లాంటి వాళ్ళను చేరువుగా లాక్కొంటోంది. పీల్చి పిప్పి చేస్తోంది. ఇది ఎలా జరుగుతోంది! ఇలాగే వస్తు వ్యామోహంతో కంపెనీలో ఎందుకు జరుగుతోంది?' పల్లవి తల విదిల్చి సీట్లోకి వెళ్ళి కూర్చుంది.

'శకుంతల ఎప్పుడూ అంటుందే అదే నిజం. ఈ నాటి లోకం ఓ సంత. అమ్మేవాళ్ళు కొనేవాళ్ళు - రెండే రెండు జాతులు! హు!'

రిపోర్టు తయారు చేయడం దాదాపు పూర్తయింది. ఆ చివరి గణాంకాలు చూస్తుంటే పల్లవికి ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్లయింది.

తమ బ్యాంక్ గత పదేళ్ళలో అప్పులిచ్చిన పాలసీలు -అంటే పెట్టుబడి పెట్టినవన్నీ -పట్టణాలలోనూ నగరాలలోనూ కేంద్రీకృతమైనాయి. ఇవన్నీ ఇళ్ళకూ, కార్లకూ, ఇతర విలాసాలకై ఇవ్వబడ్డాయి. గ్రామీణ రుణాలు తగ్గిస్తూ వస్తున్నారు.

ఇవే కాక, అనేక ఎలక్ట్రానిక్ షాపులు గృహోపకరణాల వ్యాపారులకు తమ బ్యాంకు పెట్టుబడి పెట్టింది. లాభం లేనిదే వ్యాపారి వరదన పోడు! ఇదంతా ఎంత లాభసాటి వ్యాపారమో తన ఎదురుగా ఉన్న లెక్కలు చెబుతున్నాయి!

ఇవన్నీ పట్టణాలలోని మధ్య తరగతి కుటుంబీకులు, ఉద్యోగస్తులు చేసిన అప్పులు. తమ వద్దే కాక ఆయా షాపుల వారు ఇస్తోన్న ఆకర్షణీయమైన వడ్డీలతో రుణసదుపాయాలు!'

పల్లవి కాళ్ళు చల్లబడ్డాయి. అరచేతుల్లో చెమట్లు పట్టాయి.

'ఎంత పెద్ద సాలెగూడు! అందమైన మిలమిల మెరిసే దారాలతో –' పల్లవి ఊపిరి పీల్చి వదిలింది, 'వస్తువు – ఇవ్వాళ భూమి పరిభ్రమిస్తోంది ఆ వస్తువు చుట్టే ! సమస్తం సర్వస్వం వస్తుమయం –'

పల్లవి ఆలోచనలకు అడ్డం పడుతూ సెల్‌లో ఎస్సెమ్మెస్ – అనూప్ నుంచి. లంచ్‌టైం లో ఫోన్ చేయమంటూ.

"ఓ – అప్పుడే లంచ్‌టైం కావస్తోందా ?" పల్లవి కాగితాల పొత్తిని ఫైల్‌లోకి నెట్టేసింది. మౌనంగా డైనింగ్‌హాలు వైపు కదిలింది.

ఒక కొత్త పరిశీలన – ఒక కొత్త దృష్టి – ఆమెను కమ్మేసింది. "కంపెనీలకు కట్టుబడి ఉండడానికి ఉద్యోగులపై విసిరిన కొత్త వల! చేసిన అప్పులు తీరేదాకా చేరిన ఆ కంపెనీకే బద్ధుడై ఉండాలి! నిజం!!

ఈ కాలంలో అవకాశాలు గద్దల్లా వచ్చి ఉద్యోగుల్ని తన్నుకుపోతుంటే – వారి వస్తు వ్యామోహం వారిని కదలనీయని కదలలేని కట్టు బానిసలను చేస్తుందే! అయ్యో!!'

పల్లవి డైనింగ్ హాలులోకి నడిచింది. అక్కడి కిటికీలో గుండా కనబడుతుంది. పెద్ద హోర్డింగ్ – ఏదో మోటార్ బైక్‌ది బ్రహ్మాండమైన అడ్వర్‌టైజ్‌మెంట్.

అది స్వంతం చేసుకోకపోతే జీవితమే వ్యర్థమంటూ – కళ్లలో వెలుగులు నింపుకున్న హీరో – పక్కనే జిగేలుమంటున్న హీరోయిన్.

అన్యమనస్కంగా బయటకు నడిచింది. అనూప్ కి ఫోన్ చేసింది.

"అనూప్ .. ఏమిటీ విషయం?"

"అర్జున్ చెప్పలేదా?"

"ఏదీ ...వాడి స్పోర్ట్స్ డే సంగతా? చెప్పాడు. వాడికేదో షూస్ కావాలంట. అలాగే, క్రికెట్ సెట్, టెన్నిస్ ర్యాకెట్ కూడా. అన్నీ – బ్రాండ్ న్యూ!" పల్లవి చాలా యథాలాపంగా అన్నా కూడా ఆ వస్తువుల జాబితా ఆమెను దిగ్భ్రాంతి పరుస్తూనే ఉంది. అవి తీసుకురానిదే వాడికి ఆటల్లో ప్రవేశం ఉండదు మరి!

"ఆ విషయం కాదు. అసలు విషయం!"

"అసలు విషయమా .. ఏ విషయం?"

"వాడితో చెప్పమన్నానే –"

"ప్రత్యేకించి నాకే చెప్పమన్నారా? " పల్లవి కాసేపాగి అంది, "అలాంటి ప్రత్యేక విషయం వాడేమీ మాట్లాడలేదు –"

"అదే...నాకు డబ్బు అవసరమనీ –"

"దానికి అర్జున్ చెప్పడం దేనికి? నువ్వే చెప్పచ్చుగా?"

"ఇప్పుడే అర్జున్‌ని కలిసి వస్తున్నాను. నీకు చెప్పాననిచెప్పాడు!" ఈ సారి కరుకుగా వచ్చాయి మాటలు. "నాతో అడిగించుకోవాలని కాకపోతే ఏంటిదంతా?"

"ఒప్పుకొంటాను అనూప్ – నీ నోటితోనే వినాలనుకున్నాను. ఎందుకంటే, ఇది మంచి పద్ధతి కాదు. ఏ విషయమైనా మనం ఇద్దరం మాట్లాడుకోవడమే ఇప్పటివరకూ మనకు అలవాటు. ఎందుకీ డొంక తిరుగుడు? అందులోనూ అర్జున్ తో మధ్యవర్తిత్వం...?" తన అసహనాన్ని అదిమి పెడుతూ సాధ్యమైనంత సావధానంగా పలికింది.

"నాకు వెంటనే డబ్బు కావాలి!"

"ఇప్పటికిప్పుడు ఎక్కడ ఉంటాయి? కాస్త ముందుగా ప్లాన్ చేసుకొనే వాళ్ళం కదా? అయినా, అంత ఎమర్జెన్సీ ఏమిటి, అనూప్?"

"నీతో మాట్లాడాలంటే అందుకే వళ్ళుమంట! ముందుగా చెప్పలేదా? ఆ బ్రోచర్ మన టేబుల్ మీద పెట్టి నెల రోజులయింది!" కత్తిరించినట్లుగా కటువైన వాక్యాలు.

"ఏ బ్రోచర్-?" పల్లవి అయోమయంగా అడిగింది.

"ఆ షాప్ వాళ్ళది!"

"అనూప్ నువ్వు ఎన్నో బ్రోచర్లు కలెక్ట్ చేస్తుంటావు. పేపర్లలోని ప్రకటనలు కత్తిరించి పెడుతుంటావు. అంత మాత్రాన నువ్వు ఏమి కొనాలను కొంటున్నావో నాకెలా తెలుస్తుంది? అనూప్ ...నేనెలా ఊహిస్తాను.. ఇప్పటికిప్పుడు రెండున్నర లక్షలంటే...?"

"ఎవడికి తెలుసు...?" కరుకుగా దూసుకు వచ్చింది అనూప్ కంఠం, "నువ్వు నన్నొక పనిమనిషిని చూసినట్లు చూస్తున్నావ్? నేనంటే నీకు లెక్కలేదు!! తెచ్చి ఇంట్లో పెడతాను. అప్పుడు...అప్పుడేం చేస్తావ్?" పల్లవి పెదవి విప్పేలోగానే అవతల రిసీవర్ క్రెడిల్ పైన ధన్ మని పడింది!

పల్లవి తల పట్టుక్కూర్చుంది.

'ఇదంతా ఏమిటి? ఒక వస్తువు! ఒకే ఒక వస్తువు! తమ దంపతీబంధాన్నే హేళన చేస్తూ తమ మధ్య వచ్చి చతికిలపడింది. ఒకే ఒక వస్తువు - ముచ్చటైన తమ కుటుంబాన్ని ముక్కలు ముక్కలు చేస్తోంది! మనశ్శాంతి లేకుండా చేస్తోంది. ఛ!

అనూప్ మొదట తనంటే భయం అన్నాడు. ఆ తరువాత వళ్ళు మంట అన్నాడు. ఇప్పుడు చులకన చేస్తున్నానంటున్నాడు. లెక్క చేయట్లేదంటున్నాడు! ఇదంతా ఎటు వైపు దారి తీస్తోంది?' పల్లవి పడికిళ్ళు బిగించింది, 'వాట్ ఎ నాన్సెన్స్! హాయిగా ఉండాల్సిన వాళ్ళం - ఎందుకీ మనస్పర్థలు?'

"హేయ్ పల్లవీ... ఏ లోకంలో విహరిస్తున్నావే తల్లీ! నీ అకౌంట్ అప్‌డేట్ చేశాను. నీ చెక్ క్లియర్ అయి వచ్చింది. నాకు పార్టీ ఎప్పుడు?" శకుంతల డైనింగ్ హాలు ఆ మూల నుండి కేకేసింది.

పల్లవి ఒక్కసారిగా మనుషుల్లో పడింది. శకుంతలకు చేయి ఊపింది. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

పల్లవికి ఇప్పుడు విషయం స్పష్టమయింది. 'ఈ వత్తిడిలో పడి అసలు విషయం మర్చిపోయింది. అదీ...ఆ చిట్టి –ఎర్రటి – పాస్‌బుక్ – అదీ అనూప్ ప్రవర్తనలో ఈ అనూహ్య మార్పుకు కారణం! అర్జున్ అన్నట్లుగా , ఇవ్వాళ సరిగ్గా పదోతారీఖు! డబ్బు తమ చేతిలోకి వచ్చింది. అనూప్ అన్నీ ఆలోచించే అలా నిర్ణయాలు తీసుకొన్నాడన్నమాట!

మధ్యాహ్నం ఎలా గడిపిందో ఎలా గడిచిందో పల్లవికి స్పృహే లేదు. యాంత్రికంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పూర్తి చేసింది. మేనేజర్‌కి అప్పజెప్పింది. రోజటి కన్నా కాస్త ముందుగా బయలుదేరింది.

డెస్క్ దగ్గర ఒక్క నిమిషం కూర్చుని – ముఖాన్ని దోసిట్లో సేద తీర్చుకుంది.

డెస్క్‌లో ఉంచిన ఎర్ర పాస్ బుక్‌ను, తన అకౌంట్ కాపీని హ్యాండ్‌బ్యాగ్‌లోకి నెట్టేసింది. నిర్లిప్తంగా.

"ప్చ్! పొదుపు చేసిన డబ్బు!" పల్లవి నిర్వేదంగా అనుకుంటూ – ఇంటిదారి పట్టింది.

మళ్ళీ అదే ట్రాఫిక్ సిగ్నల్. రెడ్‌సిగ్నల్. హాల్ట్.మళ్ళీ అదే హోర్డింగ్. అదే హొయలొలికే యువజంట.

పల్లవి ఓ నిర్ణయానికి వచ్చింది. ఇంటిదారి వదిలి షోరూంకి వెళ్ళింది తిన్నగా. అక్కడ ఒకే ఒక టివి సెట్ ఉంది. డిస్ ప్లే కొరకు.

అది కంపెనీ వారి డీలర్ ఔట్‌లెట్. ఇప్పటి వరకూ ఎవరికీ అమ్మలేదు. కొనదలచుకొన్నవారి వివరాలతో బుక్ చేసుకొంటున్నారు. ఇప్పటికే చాలా మంది ఆసక్తి చూపారని అతను గర్వంగా చెప్పాడు.

దాని ఖరీదు సుమారు మూడు లక్షల డెబ్బై వేలు. అంత పెద్ద టెలివిజన్‌కు దిట్టమైన స్టాండ్ కావాలి కదా! అది ముప్పై నలభై వేలు. స్పీకర్లు వగైరాలతో కలిపి అవసరమైనవన్నీ – లెక్కవేస్తే మరో యాభైవేలు. రశీదు కావాలంటే – ఈ ట్యాక్స్ ఆ ట్యాక్స్ – చివరికి లెక్క తేలిస్తే – నాలుగున్నర లక్షల పై చిలుకు!

కళ్ళు బైర్లు కమ్మినట్లయింది పల్లవికి. 'బాప్‌రే !'

"ఇది నిజంగా అంత ఖరీదు చేస్తుందంటారా ?" నూతిలోంచి వచ్చినట్లు వచ్చాయి మాటలు.

"భలే వాళ్ళండి మీరు! అసలు మార్కెట్‌లో రిలీజ్ కాకముందే బుక్కయిపోతే–?" అతను లిస్ట్ తీసి ఆమె ముందు పెట్టాడు.

ఆ లిస్ట్‌లో అనూప్ పేరు – ఉండనే ఉంది!

పల్లవి నోరు తడారి పోయింది.

"మాదే ఫైనాన్స్ కంపెనీ ఉంది. మేమే అన్నీ అరేంజ్ చేసేస్తాం. అయితే మీరు ప్రాసెసింగ్ ఫీజు కట్టాలి. పదివేలు..." అతను చెప్పుకుపోతున్నాడు.

పల్లవికి తెలియని లెక్కలు కావుగా? చక్రవడ్డీతో తిమ్మిని బమ్మిని చేసి – చివరకు ఆ వస్తువు విలువ ఏ స్థాయికి తీసుకువెళ్ళారో–!

"...నెలకు ఓ చెక్ పంపడం – అంతే! మీకు ఏ ఇబ్బందీ ఉండదు –"

"థ్యాంక్ యూ –" పల్లవి ఎలాగో షోరూమ్ లో నుంచి బయటపడింది.

"అదీ ఇబ్బందయితే పోస్ట్ డేటెడ్ చెక్కులు సంతకం చేసి ఇచ్చేయండి. మామూలుగా ఎవరైనా అంతే –" అతను వెనకనుంచి అంటున్నాడు.

పల్లవికి తలదిమ్ము ఒక్కసారిగా వదిలినట్లయింది. ఆలోచనలు ముసురుకున్నాయి.

'ఒక వస్తువును స్వంతం చేసుకోవడం – అన్న భావన మనిషిని ఎంతకు దిగజార్చుతుంది ! అనూప్ …తన అనూప్ …మొట్టమొదటసారిగా ధర విషయమై అబద్ధం ఆడాడు. చేసిన వ్యవహారాన్ని దాచి ఉంచాడు.

అంతేనా ? మొదటిసారిగా తనను శత్రువుగా చూశాడు. ఒక పెత్తందారుగా భావించాడు. పిల్లవాడిని మధ్యవర్తి ని చేశాడు –!

మొదటిసారిగా తమ మధ్య పారదర్శకత మాయమైంది. ఒక దట్టమైన మేఘం తమ దాంపత్యం పై వాలింది. ఒకే వస్తువును స్వంతం చేసుకోవడం కోసమేగా ఇదంతా…?

కాదు… కాదు… ఇది మొదటిసారి కాదు. లోగడ తాము ఎన్నో వస్తువులు స్వంతం చేసుకొన్నారు. ఇద్దరూ మోజు పడేవారు. కొత్త కొత్త వస్తువులతో ఇల్లంతా నింపేసేవారు.

అలాగే, ఇల్లు, కారు, కైనెటిక్ … అవీ ఇవీ ఎన్నో కొన్నారు. అవన్నీ – చిన్న చిన్నవి. కొన్ని స్థిరాస్తులు. కొన్ని ఇద్దరూ కలిసి –తెలిసి – కొన్నవి. అందుకే, ఎలాంటి స్పృహ తనకీ కలగలేదు.

ఎందుకు కొంటున్నాము – అన్న ఈ ఆలోచన ఇవ్వాళ మొదటిసారి వచ్చింది! ఇంత బలంగా!

నిజం. ఇప్పటికీ మునుపు కొన్న వస్తు వాహనాల అసలు, వడ్డీలకే ఒకరి జీతం సరిపోతుంది. ఆ అప్పులు తీరితే గానీ – ఆ వస్తువులు తమ స్వంతం కావు. ఆ స్పృహ కూడా తమకు లేదు!

ఇప్పుడు ఒక్కరి జీతంతో కుదురుగా జీవితం నెట్టుకొస్తున్నామే - మళ్ళీ ఈ అప్పు పెనుభారం కాదూ? నెల నెలా ఎక్కడ నుంచి తెచ్చి కట్టాలి?' పల్లవి కళ్ళు చిట్లించింది.

ఆమె వాహనం లాగానే ఆలోచనలూ ఇంటిదారి పట్టాయి. ఎక్కడలేని దిగులు ఆమెలో నిండిపోయింది.

'నిజమే, చూడడానికి తమవి అమరిన జీవితాల్లా కనబడుతున్నాయి. ఇద్దరి జీతాలు. ఒకే ఒక బిడ్డ. కానీ, ఇంత లేమి - ఇంత లేని తనం - అంతా ఎందుచేత? ఒక్కో వస్తువు విసురుతోన్న వలలో చిక్కడం చేతనేగా? కాదు. కానే కాదు. ఆ మెరమెరలు కొద్దో గొప్పో ఎప్పుడూ ఉండేవే - కానీ, వాటి చేత చిక్కని విచక్షణని కోల్పోవడం చేత-! నిజం! ముప్పాతిక మువ్వీసల నిజం!'

పల్లవి ఇంట్లోకి వచ్చేసరికి - అర్జున్, అనూప్ ఇద్దరూ వచ్చేశారు. ఇల్లంతా నిగూఢమైన నిశ్శబ్దం. పల్లవి కూడా చడీ చప్పుడు లేకుండానే లోపలికి నడిచింది.

అర్జున్ అమ్మానాన్నల వంక బిక్కముఖం పెట్టుకొని మార్చి మార్చి చూస్తున్నాడు.

"హాయ్!" ఇద్దరినీ కలిపి ఒకే పలకరింపు విసిరేసింది పల్లవి.

అనూప్ ముఖం పుస్తకంలోకి వంచేశాడు. అతని కనుబొమలు మరింత ముడిపడ్డాయి.

"అర్జున్ .. నీ ఫ్రెండ్ మనోజ్ కనబడ్డాడు. వాళ్ళంతా క్రికెట్ ఆడుతున్నారు. నిన్ను రమ్మన్నారు. కమాన్ ..రన్...!"

అర్జున్ బ్యాట్ తీసుకొని బయటకు పరిగెత్తే వరకు - పల్లవి ఫ్రెషప్ అయ్యింది. తిన్నగా వచ్చి అనూప్ ఎదురుగా కూర్చుంది. చెరో కప్పు వేడి టీతో సహా.

"అనూప్ – ఇదుగో పాస్‌బుక్ – సంతకం చేసిన చెక్. నీకు కావాలంటే టివి కొనుక్కురా. కానీ, ఈ అనవసరపు పట్టుదలతో మన ఇద్దరి మధ్యా ఏ అవాంఛనీయ సందర్భం రావడం నాకు ఇష్టం లేదు –" పల్లవి చాలా స్పష్టంగా నెమ్మదిగా చెప్పింది, ఇంతకు మునుపు, ఏది కొనాలనుకొన్నా మనం కలిసి వెళ్ళేవాళ్ళం. కలిసి నిర్ణయించుకొనేవాళ్ళం. కలిసి డబ్బులు ఖర్చు పెట్టేవాళ్ళం "నువ్విలా చేయడం నాకు బాధ కలిగించింది..." పల్లవి అనూప్ చేతిని తన చేతిలోకి తీసుకోబోయింది. "అయినా, ఇంటికి టివి తెస్తే అందరం కలిసి చూడాలనే కదా..."

"అవును! నువ్వు చేసేదంతా కరెక్ట్! నేను చేసేదంతా తప్పు!" అనూప్ ఆమె చేతిని విసిరి కొట్టాడు.

"తప్పు ఎవరు చేసినా తప్పే! నేను తప్పొప్పుల విషయం మాట్లాడట్లేదు. అనూప్... ఇదుగో నీ ముందుంచాను. మనం చేసిన పొదుపు. నీ ఇష్టమైనట్లుగా వాడు. కానీ, ఒక చిన్న ప్రశ్నకు సమాధానం చెబుతావా? ఈ పెట్టే ఖర్చు మన ముగ్గురి జీవితాలను ఏ విధంగా మార్చబోతోంది?" నొచ్చుకుంటున్న మనసును కూడదీసుకుంటూ ఒక్కో మాటను జాగ్రత్తగా మాట్లాడింది పల్లవి.

అనూప్ మాట్లాడలేదు.

"ఎంత ఖరీదైన టివి అయినా అవే ఛానళ్ళు అవే ప్రోగ్రాములు. మన టివి మాత్రం మామూలు మోడలేమీ కాదుగా? కొని ఏడాది తిరగలేదు. ఆ విషయం అలా ఉంచు. మనం కావాలంటే ఎప్పుడైనా షాప్‌కి వెళ్ళి కొనుక్కోవచ్చు. కానీ, ఒక్కటి మాత్రం నిజం..." పల్లవి ఆలోచనలు పేర్చుకుంటూ... తనను తాను సంభాళించుకొంటూ... అనూప్ స్పందన కోసం చూసింది.

ఊహు... అనూప్ లో ఏ రకమైన స్పందనా లేదు. మచ్చుకైనా.

ఇక, పల్లవి అతని స్పందనల కొరకు ఎదురు చూడడం మానేసింది. తన అభిప్రాయాన్ని చెప్పడం మొదలు పెట్టింది. సాధ్యమైనంత తేటగా.

"అనూప్... నేనూ తప్పు చేశాను. ఇలా డబ్బు దాచాను. నీకు తెలిసేట్టుగానే దాచాను. ఎందుకో కూడా నీకు తెలుసు. అయినా చెబుతాను. నేనూ ఒక వస్తువును కొనాలనుకొన్నాను. అదీ అర్జున్ కోసం!"

పల్లవి క్షణమాగి కొనసాగించింది. అనూప్‌లో ఏ మార్పు లేదు.

"అనూప్ ... నువ్వూ నేనూ చదివినప్పటి చదువులు కాదు అర్జున్ చదివేది. ఇవ్వాళ్టి చదువు అంగడిలో నిలబెట్టిన సరుకు. కోచింగ్ సెంటర్లు – ఆ సెంటర్లలో చేర్పించడానికి కోచింగ్‌లు – ఫీజులు – డొనేషన్లు –బిల్డింగ్ ఫండ్లు – పుస్తకాలు – యూనిఫాంలు – స్పోర్ట్‌కిట్స్ – షూస్ .. ఒక్కటేమిటి – మనకి ఇంకో బిడ్డే ఉండి ఉంటే అసలు... అసలు... బడిలో చేర్చగలిగే వాళ్ళమేనా అనిపించేంత ఖర్చు! మనం ఎలాంటి చదువు కావాలను కొంటున్నామో – ఏ స్థాయి చదువు కావాలనుకొంటున్నామో – అన్ని రూపురేఖల్లో – అంతా దొరుకుతుంది. కానీ, డబ్బుతో! కేవలం డబ్బుతో!!

ఊహు .. కాదు... డబ్బుతో ఈ చదువు దొరకదు. దానికి తగ్గ ప్రమాణం వాడే సాధించాలి. అదే పిల్లవాడిని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దానిని అందుకొనేందుకు వాడు ఉరుకులు పరుగులు పెడుతున్నాడు. ఊపిరి తీసుకోకుండా! వాడి పని వాడు చేస్తాడు. చేసేట్లు మనమూ బడి వగైరాలు చూస్తాం. సరే,

ఉన్న ఒక్క బిడ్డను ఉన్నంతలో బాగా చదివియ్యాలనుకొన్నాను. ఆ తాపత్రయం తోనే నేను డబ్బు దాచాను. చదివితే కాని వాడి భవిష్యత్తులో బతుకు తెరువు ఉండేట్లుగా – కనబడడం లేదు! ఊహిస్తే చాలా భయం వేస్తోంది.

నేను నీతో కరుకుగా ప్రవర్తించివుంటే - అది ఆ భయంతోనే!"

అనూప్ నుంచి పిసరంత ప్రతిస్పందన లేదు.

పల్లవి అతను వింటున్నాడో లేదో నన్న ధ్యాస కూడా వదిలేసింది. అనూప్ శూన్యంలోకి చూస్తున్నా - ఆమె అతని ముఖంలోకి చూస్తూ అంది.

"ఇదుగో ... ఈ విలాసవంతమైన జీవితాన్ని భరించేశక్తి నిజానికి మనకు లేదు. అయినా, ఆ భారం మోస్తున్నాం. మన బిడ్డనూ విలాసమే జీవితావసరం- అనేట్లుగా పెంచుతున్నాం. ఇలా కాకుండా మరోలా జీవించడం వాడికి తెలుసా?

చుట్టూ పేరుకుపోతున్న ఈ వస్తువులు నన్ను భయపెడుతున్నాయి అనూప్ - మనం ఎటు వెళుతున్నామో ఏమయిపోతామో - అన్న ఆలోచనలో ఇప్పటికైనా కాస్త పడకపోతే ఎలా?

తాతలనాటి తరగని అస్తులూ లేవు. మన జీతాలు అమాంతం పెరగబోయేదీ లేదు. అయినా, మన జీతాలతో పాటు మన జీవితాలను ఎప్పుడో తాకట్టు పెట్టేసాం! ఈ రకరకాల వస్తువుల ప్రలోభాలలో వ్యామోహాలలో పడి - మనకు తెలియకుండానే -ఊబిలోకి కూరుకుపోయాం.

ఇకనైనా, మనం గ్రహింపుకు రాకపోతే, అవగాహనతో ముందుకు సాగకపోతే - ఇంక ఏ సుడిగుండాల్లో చిక్కుకు పోతామో - ఏ శ్లేష్మాల్లో మలిగిపోతామో -"

పల్లవి మాటలు అర్ధాంతరంగా ఆగాయి. అంతలోనే... మళ్ళీ అంది,

"ఇక, నీ ఇష్టం. నేను నా అభిప్రాయం చెప్పినట్లే. వయసు రీత్యా ఈ కుటుంబంలో పెద్దవాడివి. కాస్త పెద్దరికంతో నిర్ణయించుకో. పాస్‌బుక్కు -

చెక్ లీఫ్ నీ చేతిలో ఉన్నాయి. టివీనే కొంటావో... చదువునే కొంటావో ...మరి నీ ఇష్టం!" పల్లవి నిలువునా నీరయి పోయింది, "కానీ - కానీ - ఒక వస్తువును స్వంతం చేసుకోవడం కోసం - నువ్వు ..ఇలా... దిగజారిపోతావని... నేనేనాడు ఊహించలే...!"

పల్లవి మాటలు ఆమె గొంతు దాటలేదు. లోలోనే కుప్పకూలిపోయింది. తనను తాను తమాయించుకొంటూ లోపలి గదిలోకి వెళ్ళిపోయింది - చరచర!

ఆమె మాట విరుపులో నడక మెరుపులో - ప్రకటితమైన అవ్యక్త భావం బహుశా అనూప్‌ను కదిలించే ఉంటాయి.

అందుకే కాబోలు - ఆమె వెనకే నెమ్మదిగా భారంగా నడిచాడు. అడుగులో అడుగు వేసుకొంటూ.

ముచ్చటైన ఎర్రటి పాసుబుక్కు సోఫాలో ఇమిడిపోయింది.

ఒంటరిగా!

నంగనాచిలా!

ఏమీ ఎరగనట్లుగ

రచన
ప్రారంభం 23 డిసెంబర్ 2006
ముగింపు 13 జనవరి 2007